సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 12 । నవంబర్ । 2023



పూల హారాలకు డిమాండ్

ఆదివారం సాయంత్రం లక్ష్మీ పూజ, సోమవారం దీపావళి పండగ ఉండడంతో పూల హారాలు కొనేందుకు జనం ఎగబడడంతో డిమాండ్ పెరిగింది.



గుప్తనిధుల ముఠా పట్టివేత

గుర్రంకొండ మండలంలోని నగరి పరిసర కొండల్లో గుప్తనిధుల కోసం తవ్వుతున్న ముఠాను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

- 2లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.210	రూ.280
రెండోరకం	రూ.110	రూ.200

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 346 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	380	450
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 769.140 కిలోలు

న్యూస్‌రీల్

ఇంటింటా వెలుగులు నిండాలి

- దీపావళి సందర్భంగా ప్రజలకు ప్రజా ప్రతినిధులు, అధికారుల శుభాకాంక్షలు



ఎంపీ మిథున్‌రెడ్డి



ఎమ్మెల్యే గడికోట

రాయచోటి : చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే దీపావళి పండుగతో.. ప్రతి ఒక్కరి జీవితాలలో వెలుగులు నిండాలని ఆకాంక్షిస్తూ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్, శాసన సభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసన మండలి ఉపాధ్యక్షురాలు జకియా ఖానం, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ జిల్లా వాసులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. టపాసులు కాల్చే సమయంలో పిల్లలు, పెద్దలు జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలందరూ సంతోషంగా పండగ జరుపుకోవాలని కోరారు.

24 నుంచి కలాంవిజన్-2023



ప్రాజెక్టు నిర్వహణ కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు, నిర్వాహకులు

రాయచోటిటౌన్ : ఈ నెల 24, 25వతేదీల్లో కలాం విజన్-2023 సైంటిఫికల్ ప్రాజెక్టు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఓ శ్రీరాం పురుషోత్తం, ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. డీఈఓ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన శనివారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 28, 29వ తేదీన సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు ఉండడంతో ముందస్తుగా ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యజమానులు గమనించాలని ఆయన కోరారు.

అరుణాచలం, శ్రీశైలానికి ప్రత్యేక సర్వీసులు

రాజంపేట : కార్తీకమాసంలో అరుణాచలం, శ్రీశైలానికి ప్రత్యేక సర్వీసులు నడిపిస్తున్నామని డిపో మేనేజర్ గుండాల రమణయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్తీక దీపదర్శనం నిమిత్తం ఈనెల 26న ఆదివారం ఉదయం 6గంటలకు డిపో నుంచి బస్సు సర్వీసు ఉంటుందన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. రానుపోను చార్జి రూ.1130గా నిర్ణయించామన్నారు. అలాగే మూడురోజుల పంచారామాల దర్శనం చేసుకునేందుకు వీలుగా ఆర్టీసీ అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట, కనకదుర్గమ్మ, మంగళగిరి నరసింహస్వామి టూర్ ప్యాకేజీ సర్వీసును అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. టికెట్ రూ.3వేలు ఉంటుందన్నారు. రెండురోజుల టూర్‌ను ఖరారు చేసామని, ఇందులో శ్రీశైలం, మహానంది, నందవరం, యాగంటి, రవ్వలకొండలను దర్శనం చేయిస్తామన్నారు. రూ.1700 టికెట్ ధరగా నిర్ణయించామన్నారు. కార్తీకమాసాన్ని దృష్టిలో ఉంచుకొని నాలుగు వారాలు స్పెషల్ సర్వీసును నడుపుతున్నామన్నారు. భక్తులు రామయ్య (7382868300), ఆర్‌వీబీరాజు(7981738566) నంబర్లను సంప్రందించాలని డీఎం సూచించారు.

పక్కాగా ఫీవర్ సర్వే



నీటి ట్యాంక్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

సంబేపల్లె : మండలంలోని నారాయణరెడ్డి పల్లిలో ఫీవర్ సర్వేను జిల్లా వైద్యాధికారి కొండయ్య తనిఖీ చేశారు. పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.

అప్రమత్తతతో.. ప్రమాదాలకు చెక్

- విజయవాడ బస్సు ప్రమాదం నేపథ్యంలో ఆర్టీసీ అప్రమత్తం
- 55 ఏళ్లకు పైబడిన వారికి దగ్గర గ్రామాలకు విధుల కేటాయింపు
- సెఫ్టీ డ్రైవింగే ధ్యేయంగా చర్యలకు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- ఔట్ సోర్సింగ్ డ్రైవర్ల ప్రవర్తన, భద్రత పెంపుపై ప్రత్యేక నిఘా

విజయవాడ బస్టాండులో బస్సు దుర్ఘటన నేపథ్యంలో ఆర్టీసీ అప్రమత్తమైంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలకు ఉపక్రమించింది. 55 ఏళ్లకు పైబడి అనారోగ్య సమస్యలున్న డ్రైవర్లను దూర ప్రాంత సర్వీసులకు పంపకూడదని నిర్ణయించారు. ఆ సర్వీసుల్లో ఎక్కువగా రాత్రి విధులు నిర్వహించాల్సి వస్తుండడంతో ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని భావిస్తున్నారు.



రాజంపేట : అన్నమయ్య జిల్లాలో రాజంపేట, పీలేరు, రాయచోటి, మదనపల్లె-1, మదనపల్లె-2 డిపోలు ఉన్నాయి. వీటి నుంచి మొత్తం 498 బస్సులను వివిధ ప్రాంతాలకు నడుపు తున్నారు. ఇందులో ఆర్టీసీ సొంత బస్సులు 358 కాగా, అద్దెకు తీసుకున్నవి 140 ఉన్నాయి. వీటిని నడిపే సిబ్బందిలో కొందరు వయసు మీరిన వారే ఉన్నారు. ప్రమాదాలను నివారించేందుకు ఆర్టీసీ అధికారులు కొన్ని నిబంధనలు పాటించాలని భావిస్తున్నారు. విజయవాడలో బస్సు అదుపు తప్పి ప్లాట్ ఫాంపైకి దూసుకెళ్లిన దుర్ఘటనలో ముగ్గురు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. అటువంటి ప్రమాదాలకు తావు లేకుండా చేయాలని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. ప్లాట్‌ఫాంల వద్ద కాంక్రీట్ స్టాపర్లను ఏర్పాటు చేయనున్నారు. బస్సు అదుపు తప్పి దూసుకొస్తే ప్లాట్‌ఫాంపైకి వెళ్లకుండా ఇవి అడ్డుకుంటాయని ఆలోచన చేస్తున్నారు.


అరోగ్యంగా ఉన్నవారినే..

ఆరోగ్యంగా ఉన్న డ్రైవర్ల అంగీకారంతోనే పగటి పూట నడిచే దగ్గర ప్రాంతాల్లో ఎక్స్‌ప్రెస్ బస్సులకు కేటాయిస్తారు. వారి స్థానంలో 55 ఏళ్ల వయస్సు లోపు ఉన్న డ్రైవర్లను పంప నున్నారు. ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న డ్రైవర్లను అత్యవసర సమయాల్లో దూర ప్రాంత సర్వీసులకు పంపేవారు. ఇప్పుడు వారిని ఆ సర్వీసులకు పంపడం లేదు. సీనియర్ డ్రైవర్లు దూర ప్రాంత సర్వీసులకే గానీ, దగ్గర రూటు/పల్లె వెలుగులో విధులు నిర్వహించ డానికి ఆసక్తిచూపరు. విజయవాడ బస్సు ప్రమాదంతో ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం పలు నిర్ణయాలు తీసుకోవడం కార్మిక వర్గాల్లో చర్చనీయాంశమైంది.

నిబంధనల అమలు

సాధారణంగా బస్సు చిన్నపాటి ప్రమాదానికి గురైనా సంబంధిత బస్సు డ్రైవర్‌కు ఆర్టీసీలో శిక్షణకు పంపిస్తుంటారు. విజయవాడ బస్సు ప్రమాదం నేపథ్యంలో ఔట్ సోర్సింగ్ , అద్దె బస్సుల డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఈ శిక్షణలో ఒక పూట థియరీ, మరోపూట నిపుణుల సమక్షంలో డ్రైవింగ్ పరిశీలన ఉంటుంది. ప్రమాదాల నివారణపై మెలకువలను నేర్పిస్తారు. ఆర్టీసీ, అద్దె బస్సు, ఔట్ సోరింగ్ డ్రైవర్లందరికీ దశల వారీగా శిక్షణ ఇప్పించాలని ఆర్టీసీ యోచిస్తోంది. ప్రయాణికుల పట్ల ఆర్టీసీ డ్రైవర్ల ప్రవర్తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులందుతున్నాయి. ఇలాంటి వారు సత్ప్రవర్తనతో మెలిగేలా నిపుణులు కౌన్సిలింగ్ ఇవ్వనున్నారు.

ప్రతి డిపోలో బ్రేక్ సిస్టమ్స్‌పై సెన్సస్



ప్రతి డిపోలో బ్రేక్ సిస్టమ్స్ సెన్సస్ తీయనున్నాం. రోడ్డెక్కాలంటే ఎఫ్‌సీ తప్పనిసరి. పీఎంఈ(పీరియాడికల్ మెడికల్ ఎగ్జామినేషన్) లేకుండా సర్వీసులు ఇవ్వడం లేదు. 55కు పైబడిన డ్రైవర్లను దూర ప్రాంత సర్వీసులకు పంపేలా జాగ్రత్తలు పాటిస్తాం. రీజనల్ స్థాయిలో ప్రతి మంగళ, శుక్రవారంలో డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తాం.

– రాము, జిల్లా ప్రజారవాణా అధికారి, రాయచోటి

దూర ప్రాంత సర్వీసులు నడపడం లేదు



నా పేరు రంగప్ప. నా వయస్సు ఇప్పుడు 61 ఏళ్లు. సర్వీసులో డిపో బెస్ట్ కెఎంపీఎల్ సాధించాను. ఆర్టీసీ అధికారులు 55కు పైబడి తమలాంటి వారికి దూర ప్రాంత సర్వీసులు కేటాయించడంలేదు. తాను అయితే దగ్గర ప్రాంతసర్వీసులు తిరుగుతున్నా. ముందుగా నేను బ్రేక్ చూసుకుంటాను. ఆ తర్వాత రోడ్డెక్కుతాను.

– రంగప్ప, సీనియర్ డ్రైవర్, రాజంపేట డిపో

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి




మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను విద్యలో ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులకు కృషి చేయాలని విద్యాశాఖ రాష్ట్ర పర్యవేక్షకురాలు కల్పన, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకరెడ్డి అన్నారు. కడపలోని గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీలో భాగంగా మహిళా శిశు సంక్షేమశాఖలో పనిచేస్తున్న చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లకు, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నిర్వహించిన రెసిడెన్సియల్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయస్సు గల పిల్లలు తప్పకుండా చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలను చేయగలిగేలా తీర్చిదిద్దడమే శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ పురోగతికి, పేదరిక నిర్మూలనకు విద్య ఒక్కటే ప్రధానమార్గం అన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నతస్థానాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ ధనలక్ష్మి, ఏఏఎంఓ రామాంజనేయరెడ్డి, జీసీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో మెరిసిన మోహనుడు

సీతా మాలక్ష్మి సినిమాతో.. స్థానికులకు అనుబంధం



చంద్రమోహన్ హీరోగా నటించిన సీతామాలక్ష్మి



కురబలకోట రైల్వే స్టేషన్‌లో చంద్రమోహన్ సీతామాలక్ష్మి సినిమా సన్నివేశం (ఫైల్)

కురబలకోట : వైవిధ్య పాత్రలతో మెప్పించి.. నట విశ్వరూపం చూపిన చంద్ర మోహనుడితో కురబలకోట వాసులకు విడదీయరాని అనుబంధం ఉంది. అతడి మరణ వార్త విన్న ఆయన అభిమానులు ఉద్వేగానికి గురయ్యారు. అన్నమయ్య జిల్లా కురబలకోట రైల్వే స్టేషన్‌లో నాడు ఆయన చెప్పిన మాటలు.. చేసిన నటనను గుర్తు చేసుకున్నారు. కళా తపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో చంద్రమోహన్, తాళ్లూరి రామేశ్వరిలు సీతామాలక్ష్మి సినిమాలో నటించారు. కురబలకోట మండలంలోని తెట్టు, కురబలకోట రైల్వే స్టేషన్‌లో ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు నాడు చిత్రీకరించారు. మావి చిగురు తినగానే కోవిల పలికేనా.. పాట చిత్రీకరణ కురబలకోట రైల్వే స్టేషన్‌లో జరిగింది. చిత్రంలో ఓ పాత్రధారి వెటకారం చేస్తూ ఏ ఊరు మీది అని ప్రశ్నించినపుడు చంద్రమోహన్ మాది మదనపల్లె వద్ద కురబలకోట అని చెబుతాడు. సినిమాలో డైలాగ్ విన్న కురబలకోట వాసులు అప్పట్లో ఊగిపోయారు. 1978 జూలై, 27న విడుదలై సంచలన విజయం సాధించిన ఈ సినిమా చంద్రమోహన్‌కు హీరోగా సినీ రంగంలో ఎదగడానికి అవకాశం ఇచ్చింది. ఈ సినిమా విజయంతో ఈ ప్రాంతంలో మరెన్నో సినిమాలు తీయడానికి చాలా మంది ముందుకు వచ్చారు. ఈ చిత్ర యూనిట్ తెట్టులోని కామకోటి ప్రసాదరావు ఇంట్లో బస చేశారు. ఒకటిన్నర నెలపాటు తెట్టు వేణుగోపాలస్వామి ఆలయం, గ్రామ పరిసర ప్రాంతాల్లోనే షూటింగ్ నిర్వహించారు.

శనివారం చంద్రమోహన్ మరణవార్త తెలుసుకోగానే.. కళ్లు చెమర్చారు. నాటి అభిమానులు ఆయన పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. కురబలకోట రైల్వే స్టేషన్ రూపురేఖలు మారినా.. ఈ ప్రాంత వాసుల మనసుల్లో ఈ సినిమా చెక్కుచెదర లేదు.

విద్యా వ్యవస్థకు పునాదులు వేశారు

రాయచోటి : భారత దేశ విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన మహనీయుడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. భారత తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా రాయచోటి ఎస్పీ కార్యాలయంలో జాతీయ విద్య, మైనార్టీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఎస్పీ బి.కృష్ణారావు, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ యూజీసీ, ఐఐఎంల స్థాపనలో మౌలానా కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ మత సామరస్యాన్ని చాటిన నాయకుడు అబ్దుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు.

కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, తదితరులు మైనార్టీల దినోత్సవం నిర్వహించారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీలు

ఈవీఎంల తనిఖీ

రాయచోటి : సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ గిరీషా పీఎస్ శనివారం పరిశీలించారు. రాయచోటి సాయి ఇంజినీరింగ్ కళాశాలలో కొన్ని గదులను జిల్లా ఎస్పీ కృష్ణారావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లతో గదులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల భద్రత పకడ్బందీగా ఉండాలని పోలీసులకు సూచించారు. సహకరించాలని కళాశాల యాజమాన్యాన్ని ఆయన కోరారు.

విద్యార్థి దశనుంచే క్రీడలను ప్రోత్సహించాలి



ఎంపిక కాబడిన విద్యార్థులతో సిఐ మధుసూదన్ రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : విద్యార్థి దశనుంచి క్రీడలలో ప్రోత్సహిస్తే ఉన్నత స్థాయికి ఎదగడానికి వీలవుతుందని సీఐ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు రోజులుగా రాష్ట్రస్థాయి తైక్వాండో అండర్-19, 17, 14 విభాగాలలో పోటీలు జరుగుతున్నాయి. రాష్ట్రస్థాయికి ఎన్నికైన వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, సెక్రటరీ శారద, విజయ ప్రసాద్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



గుప్తనిధుల ముఠా పట్టివేత

గుర్రంకొండ : గుప్తనిధుల ముఠాను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ నగరి పరిసర కొండల్లో పురాతన శివాలయం ఉంది. కొండపైన పెద్దగా జనసంచారం ఉండదు. ఈ నేపథ్యంలో గుప్తనిధుల ముఠా కన్ను ఈ ఆలయంపై పడింది. శుక్రవారం ఐదుగురు వ్యక్తులు నగరి గ్రామానికి చేరుకొని, కొండ దిగువభాగాన వారి మూడు ద్విచక్ర వాహనాలు ఉంచారు. తమ వెంట తెచ్చుకొన్న బ్యాగులు, ఇతర సామగ్రితో కొండపైకి వెళ్లారు. రాత్రి అక్కడే ఉండి శనివారం ద్విచక్రవాహనాల వద్దకు చేరుకొన్న వారిని గ్రామస్తులు గమనించారు. రెండు రోజులుగా కొండపై ఏం పని చేశారు అంటూ ప్రశ్నించారు. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో వారిని పట్టుకొని గ్రామం మధ్యలో ఉంచారు. వారి వద్ద ఉన్న వస్తువులు పరిశీలించగా.. గుప్తనిధుల ముఠా సభ్యుల దగ్గర ఉన్న వాటి వలే ఉన్నాయి. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా కొండపైన శివాలయం పరిసరాల్లో పెద్ద ఎత్తున పూజలు చేసి, నల్లకోడిని చంపిన ఆనవాళ్లు ఉన్నాయని గొర్రెల కాపరులు పేర్కొన్నారు. పూజల దగ్గర నిమ్మకాలు ఉంచారని, ఆ పక్కనే తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఈ ముఠా సభ్యులే ఇటీవల నెల రోజులుగా మూడు మార్లు కొండపైన కనిపించినట్లు చెప్పారు. పోలీసుల విచారణలో నిజాలు తేలాల్సి ఉంది.





వైఎస్సార్‌సీపీ జెండా స్తంభం తొలగింపు

- అర్ధరాత్రి దుండగుల దుశ్చర్య
- కౌన్సిలర్ ఫిర్యాదుతో కేసు నమోదు

మదనపల్లె : పట్టణంలోని 15, 16 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ జెండా స్తంభాన్ని దుండగులు తొలగించిన సంఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాగిమాను కనకదుర్గమ్మ గుడి, కమ్మవీధి, శాస్త్రివీధుల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే నవాజ్‌బాషా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అర్ధరాత్రి సమయంలో స్తంభాన్ని కోసి, తీసుకెళ్లారు. శనివారం ఉదయం గమనించిన స్థానికులు ఆయా వార్డుల కౌన్సిలర్లు రాజేష్, పాకాలహరి దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే ఈ విషయాన్ని ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు తెలిపారు. ఆయన సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ కేశప్ప, వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికులను విచారణ చేశారు. చుట్టుపక్కల సీసీ కెమెరాలు ఉన్నాయా అని వాకబు చేశారు. అనంతరం పరిసర ప్రాంతాల్లో గాలించగా.. ఈశ్వరమ్మ కాలనీలో.. కోసివేసి తీసుకెళ్లిన ఇనుప స్తంభం కనిపించింది. వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


జెండా స్తంభాన్ని కోసివేసిన దుండగులు

కారులో మంటలు

ఎర్రగుంట్ల : కల్లమల్ల, సున్నపురాళ్లపల్లి మధ్య శనివారం కారులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ కారును పక్కకు నిలిపారు. డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు బయటికి వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు.







రోడ్డు ప్రమాదంలో ఒరిస్సా వాసి మృతి

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాద ఘటన వివరాలు... ఒరిస్సా రాష్ట్రం గంజాం ప్రాంతానికి చెందిన అర్జున్ రెడ్డి(33), అతని అన్న రవి(35), స్నేహితుడు తరుణ్ (32) మదనపల్లి మండలంలోని వలసపల్లె సమీపంలోని 150 మైల్ వద్ద ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. శనివారం రాత్రి విధులు ముగించుకుని ఆలస్యంగా ముగ్గురూ ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు బయలుదేరి వస్తుండగా, పట్టణంలోని డీఎస్పీ బంగ్లా సమీపంలో రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద మరో ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరి ముగ్గురితోపాటు, మరో ద్విచక్ర వాహనంలోని వ్యక్తి సైతం తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే బాధితుల్ని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్జున్‌రెడ్డి మృతి చెందాడు. రవి, తరుణ్‌తోపాటు మరో ద్విచక్ర వాహనంలోని వ్యక్తి సైతం తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉండగా.. స్థానిక వైద్యులు చికిత్సలు అందజేశారు.

ఉరి వేసుకొని విద్యార్థి ఆత్మహత్య


శివసాత్విక్ సాయి మృతదేహం

గుర్రంకొండ : చిన్నారుల మధ్య చెలరేగిన చిన్న పాటి వివాదం ఓ విద్యార్థి ప్రాణాల మీదికి వచ్చింది. చెల్లెలు ఏవో అన్న మాటలకు మనస్తాపం చెందిన అన్న ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మండలంలోని సరిమడుగు పంచాయతీ పుల్లావాండ్లపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన లక్ష్మీకాంతం అనే మహిళకు రాయచోటి మాసాపేటకు చెందిన డి.నాగరాజుతో 15 ఏళ్లక్రితం వివాహమైంది. వీరికి శివసాత్విక్ సాయి(13), సంజన(11) అనే పిల్లలు ఉన్నారు. కొన్నేళ్ల నుంచి వీరు విడివిడిగా నివాసముంటున్నారు. శివసాత్విక్ సాయి తన తండ్రి నాగరాజు దగ్గరే ఉంటూ రాయచోటిలో ఎనిమిదవ తరగతి చదువుకొంటున్నాడు. సంజన తన తల్లితో కలసి పుల్లావాండ్లపల్లెలో ఉంటూ చదువుకుంటోంది. అప్పుడప్పుడు శివసాత్విక్ సాయి తల్లి దగ్గరికి వస్తూ పోతూఉండేవాడు. ఈ నేపథ్యంలో దీపావళిని పురస్కరించుకొని శనివారం శివసాత్విక్ సాయి తన తల్లి దగ్గరికి వచ్చాడు. అన్నాచెల్లెలు ఆడుకొంటుండగా.. ఇద్దరి మధ్య చిన్నపాటి వివాదం చెలరేగింది. దీంతో మనస్తాపం చెందిన శివసాత్విక్ సాయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

సిద్దవటం రేంజ్‌లో కూంబింగ్

సిద్దవటం : సిద్దవటం రేంజ్ మద్దూరు బీటులోని సమస్యాత్మక ప్రాంతాల్లో శనివారం తమ సిబ్బందితో కూంబింగ్ నిర్వహించామని రేంజర్ బి.కళావతి తెలిపారు. ఎక్కడా స్మగ్లర్ల ఆనవాళ్లు కనిపించలేదని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, మద్దూరు బీటు అధికారిణి ధీపిక, ఏబీఓ నారాయణరెడ్డి, బేస్ క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

రైల్వేకోడూరు : మండల పరిధిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇద్దరిని శనివారం అరెస్ట్ చేసి, 31 బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ డాక్టర్ నాయక్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుండాలపల్లిలో అల్లంశెట్టి పెంచలయ్యను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే గాంధీ నగర్‌లో షేక్ మస్తాన్‌ను అదుపులోకి తీసుకుని, 11 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.



గడ్డివామి దగ్ధం

రామసముద్రం : మండలంలోని ఆర్.నడింపల్లె పంచాయతీ మిట్టపల్లె గ్రామంలో గడ్డివామి దగ్ధమైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో టపాకాయలు పేల్చుతుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న మునస్వామి గడ్డివాముకు నిప్పంటుకుంది. గమనించిన స్థానికులు వెంటనే పుంగనూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రాతికూసాలు, గడ్డి కాలిపోవడంతో రూ.20 వేల నష్టం వాటిల్లినట్లు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. మంటలు ఆర్పడంలో అగ్నిమాపక సిబ్బంది సురేష్ , సుమన్, లోకేష్ రెడ్డి, కేశవ, మోహన్ పాల్గొన్నారు.